సాక్షి
విజయనగరం

శనివారం, 18, మే, 2024



జోరుగా ఇటుకల తయారీ

జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ జగనన్నకాలనీలు, భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇటుకలకు గిరాకీ పెరిగింది. కార్మికులకు ఉపాధి లభిస్తోంది. - 10లో



గంగపుత్రులకు మత్స్యకార భరోసా

మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఏటా సముద్రంలో వేట నిషేధ సమయంలో గంగపుత్రులకు భృతి, సబ్సిడీపై డీజిల్ అందిస్తోంది. - 10లో



బొమ్మను చేసి.. ప్రాణం పోసి

వీరఘట్టం మండలం తూడి గ్రామానికి చెందిన చక్రవర్తి బొమ్మల తయారీలో చేయి తిరిగిన నైపుణ్యంసాధించాడు. - 10లో

న్యూస్‌రీల్

19 నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాలు



శ్రీ కోదండరామస్వామివారి ఉత్సవ మూర్తులు

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ఈనెల 19వ తేదీ నుంచి శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ తెలిపారు. ఈనెల 19 నుంచి 23 వరకు పాంచాణిక దీక్షతో ఆలయ అర్చకులు వి.వి.అప్పలాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం ఘనంగా జరుగుతుందన్నారు. కల్యాణ మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

లెక్కలు చూపకుంటే చిక్కులే

- ఎన్నికల బరిలో నిల్చున్న అభ్యర్థులు ఖర్చు వివరాలు చెప్పాల్సిందే..

విజయనగరం: సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. అలా అని పోటీచేసిన అభ్యర్థులు రిలాక్స్ అయిపోదామంటే కుదరదు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నుంచి ప్రచారం పూర్తయ్యే వరకు ఎన్నికల ఖర్చును అభ్యర్థులు పక్కాగా ఎన్నికల సంఘానికి చూపాల్సిందే. లేకుంటే భవిష్యత్తులో చిక్కులు తప్పవు మరి. శాసనసభ ఎన్నికలకు ఎంత ఖర్చు చేయాలి, లోక్‌సభ ఎన్నికలకు ఎంత ఖర్చు చేయాలన్నది ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 చట్టం సెక్షన్ 19లో వివరించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న అభ్యర్థి వ్యయ పరిమితి రూ.40 లక్షలుగా, ఎంపీ స్థానానికి పోటీచేసే అభ్యర్థి వ్యయ పరిమితి రూ.95 లక్షలుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. అభ్యర్థులు చేసే ఖర్చుపై వివరాలను ఎప్పటికప్పుడు షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లో నమోదు చేస్తుంటారు. నిర్ణీత వ్యయ పరిమితికి మించి ఒక్క రూపాయి ఖర్చు దాటినా, అందుకు సంబంధించిన లెక్కలను సరైన ఆధారాలతో సమర్పించాలి. అలా, చూపకుంటే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 10ఏ ప్రకారం పోటీ చేసిన వ్యక్తి అభ్యర్థిత్వాన్ని ఎన్నికల సంఘం రద్దు చేసే అవకాశం ఉంటుంది. దీంతో పాటు వచ్చే మూడేళ్ల పాటు స్థానిక, శాసనసభ ఎన్నికలు సహా ఏ ఎన్నికల్లోనూ పోటీ చేసేందుకు అవకాశం లేకుండా అనర్హత వేటు వేస్తుంది.

ధైర్యలక్ష్మికి అభిషేకం



అమ్మవారికి అభిషేకం జరిపిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువైన అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధైర్యలక్ష్మి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ ధైర్యలక్ష్మికి పంచామృతాభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని ఆలయ ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులతో పాటు వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

ఒడిశా సరిహద్దుకు ఏనుగులు



తాలాడ వద్ద వంశధార నదిని దాటుతున్న ఏనుగులు

భామిని: ఏనుగుల గుంపు వంశధార నది అవల ఒడిశా సరిహద్దు గ్రామాలకు శుక్రవారం తరలి వెళ్లాయి. ఒడిశా కాశీనగర్ బ్లాక్ బూదర, బొత్తవ, గోరిబంద గ్రామాల సమీపంలోకి ఏనుగుల గుంపు చేరుకున్నాయి. భామిని మండలం తాలాడ సమీపంలోని తోటలో కొద్ది నెలలుగా తిష్టవేసిన నాలుగు ఏనుగుల గుంపు తరలివెళ్లడంతో తాలాడ, బాలేరు, ఘనసర, కీసర, కోసలి గ్రామాల రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

బడిగంట మోగక ముందే..



గొడౌన్‌లో పాఠ్యపుస్తకాలు (ఫైల్)

పాఠ్య పుస్తకాల ఇండెంట్లను సేకరించాం



విద్యా సంవత్సరం ప్రారంభించిన రోజునే పాఠ్య పుస్తకాలు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. అందుకు తగ్గట్టు విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే తరగతుల వారీగా కావాల్సిన పుస్తకాల ఇండెంట్లు సేకరించాం. వాటి వివరాలను పై అధికారులకు పంపించాం. పుస్తకాలు వచ్చాక జాగ్రత్తగా భద్రపరిచి విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎన్.ప్రేమకుమార్, డీఈఓ

- పాఠ్యపుస్తకాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు
- జిల్లాలో ఏడో తరగతి వరకు 15.24 లక్షల పుస్తకాల అవసరం
- 8–10 తరగతులకు నేరుగా ప్రింటింగ్ ప్రెస్ నుంచే సరఫరా
- ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపిన జిల్లా విద్యాశాఖ
- పాఠశాలల పునఃప్రారంభంరోజు విద్యార్థులకు అందజేసేందుకు సన్నాహాలు

విజయనగరం అర్బన్:

విద్యాసంవత్సరం ఆరంభానికి ముందే పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రణాళికలు సిద్ధం చేసింది. పాఠశాలల పునఃప్రారంభంరోజునే పాఠ్య పుస్తకాలు అందించాలన్న లక్ష్యానికి అనుగుణంగా అడుగులు వేస్తోంది. గత ఐదేళ్లుగా విద్యార్థులందరికీ సకాలంలో ప్రభుత్వం పుస్తకాలు సమకూర్చింది. జగనన్న విద్యాకానుకలు కింద సమస్త అభ్యసన సామగ్రిని అందజేసింది. ఈ ఏడాది కూడా ఈ నెలలోనే స్టాక్ పాయింట్లకు పాఠ్యపుస్తకాలు చేర్చేపనిలో విద్యాశాఖ యంత్రాంగం నిమగ్నమైంది.

జిల్లాలో విద్యార్థుల సంఖ్య ఇలా...

జిల్లాలో 1,803 పాఠశాలలు ఉండగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 1,404, ఉన్నత పాఠశాలలు 399 ఉన్నాయి. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏటా ఉచితంగా పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1.9 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ పుస్తకాల సరఫరా ఉచితంగా, క్రమపద్ధతిలో చేస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది కంటే ఈ సారి 10 శాతం అదనంగా పుస్తకాలు అవసరమని విద్యాశాఖ అంచనా వేసింది. ముద్రణ ప్రారంభమయ్యాక దఫదఫాలుగా పుస్తకాలు సరఫరా కానున్నాయి. గతేడాది వరకు ప్రింటింగ్ ప్రెస్ నుంచి పుస్తక గొడౌన్‌కు, అక్కడ నుంచి మండల కేంద్రాలకు సరఫరా చేసేవారు. ఈ ఏడాది ప్రింటింగ్ ప్రెస్ నుంచి నేరుగా ఆయా మండలాలకు సరఫరా చేయనున్నట్టు సమాచారం. వేసవి సెలవులు ముగిసేనాటికి మండల స్టాక్ పాయింట్లకు చేరవేసి, పాఠశాలల పునఃప్రారంభించే రోజునే విద్యార్థులకు అందజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

● ఆకర్షణీయంగా పుస్తకాలు

పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది. పాఠ్య పుస్తకంలో విద్యార్థికి అవసరమైన అదనపు సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా క్యూ ఆర్ కోడ్‌ను కూడా ముద్రిస్తోంది. దీని సాయంతో పాఠ్యాంశానికి సంబంధించిన అదనపు సమాచారాన్ని పొందేందుకు వీలవుతుంది. పుస్తకాల భారం విద్యార్థుల వీపులపై పడకుండా ఉండేందుకు సెమిస్టర్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. గత విద్యా సంవత్సరంలో కూడా రెండు సెమిస్టర్లుగా పాఠ్యపుస్తకాలను ముద్రించింది. గతేడాది 1–8 తరగతులకు సెమిస్టర్ విధానం అమలు చేయగా, ఈ ఏడాది 10వ తరగతికి కూడా సెమిస్టర్ విధానం తీసుకొచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను బైలింగ్విస్ విధానంలో ముద్రిస్తోంది. పుస్తకంలో పేజీకి ఒకవైపు ఇంగ్లిష్, మరో పేజీలో తెలుగు పాఠ్యాంశం ఉంటుంది. దీనివల్ల విద్యార్థులు సులభంగా చదువుకునేందుకు అవకాశం కలుగుతుంది. తెలుగు మీడియం విద్యార్థులకు కూడా పాఠ్యాంశాలు అర్థమవుతాయి.

● పుస్తకాల అవసరం ఇలా...

జిల్లాలో 1వ తరగతి పుస్తకాలు 1,35,375, రెండో తరగతి 1,35,578, మూడో తరగతి 2,08,971, నాలుగో తరతి 2,17,973, ఐదో తరగతి 2,68,449, ఆరో తరగతి 2,81,555, ఏడో తరగతికి 2,76,796 పాఠ్య పుస్తకాలు అవసరం. 8 నుంచి పదో తరగతి పాఠ్యపుస్తకాల ప్రతిపాదనలను ఆయా పాఠశాల నుంచి ప్రింటింగ్ ప్రెస్‌లు నేరుగా తీసుకుంటున్నాయి.



వికసించిన మే పుష్పం

తెర్లాంలోని దత్తి ప్రభావతమ్మ ఇంటి ఆవరణలో వికసించిన మే పుష్పం చూపరులకు కనువిందు చేస్తోంది. ఏడాదికి ఓ సారి కనిపించే పువ్వును స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– తెర్లాం

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

- వచ్చేనెల 1వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువకులకు ఉపాధి కలిగించే పలు కోర్సులకు ఉచిత శిక్షణ తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వసతి గృహంలో నిర్వహించనున్నారు. కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, హౌస్ వైరింగ్, సెల్ ఫోన్ రిపేరింగ్ అండ్ సర్వీసెస్ వంటి కోర్సుల్లో 30 రోజులు శిక్షణ ఇస్తారు. వసతి, భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పిస్తారు. తెలుపుకార్డు కలిగిన 45 ఏళ్లలోపు వయస్సుగల గ్రామీణ ప్రాంత మహిళలు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చేనెల 1వ తేదీలోగా దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని సంస్థ డైరెక్టర్ రమణ కోరారు. పూర్తి వివరాల కోసం సెల్: 99595 21662, 99857 87820 నంబర్లను సంప్రదించాలన్నారు.

భానుడి లేలేత కిరణాలకు బంగారు వర్ణంలో కనిపిస్తున్న ఆకాశం



● సువర్ణ శోభితం

పాలకొండ ఏజెన్సీ ప్రాంతంలో గత రెండు రోజులుగా చిరు జల్లులు కురుస్తున్నాయి. శుక్రవారం సూర్యోదయానికి ముందే చిన్నచినుకులు కురవగా.. ఆకాశంలో విరిసిన ఇంద్ర ధనుస్సు చూపరులను ఆకట్టుకుంది. సువర్ణ శోభిత వర్ణంలో ఆకాశం కాసేపు ఆహ్లాదాన్ని పంచింది. ఈ సుందర దృశ్యాలను పాలకొండ వాసులు డాబాలపై నుంచి సెల్ ఫోన్‌లలో బంధించి మురిసిపోయారు.

– పాలకొండ



మబ్బుల మధ్యలో ఇంద్రధనుస్సు

జీవనశైలిలో మార్పులే రక్తపోటుకు కారణం

- డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జీవనశైలిలోని మార్పులే రక్తపోటుకు కారణమని, సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో రక్తపోటుకు దూరంగా, ఆరోగ్యంగా జీవించవచ్చని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా విజయనగరం పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపోటును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. రక్తపోటు పెరిగితే పక్షవాతం, గుండె పోటు వచ్చే అవకాశం ఉందన్నారు. మద్యపానం, ధూమపానం, కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రతిరోజు వ్యాయమం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, ఎపిడిమాలజిస్టు డాక్టర్ జి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సంతోషి మృతికి టీడీపీ నాయకులే కారణం

- ఆమె కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలి
- వైఎస్సార్ సీపీ నాయకులు, దుప్పాడ గ్రామ వలంటీర్ల డిమాండ్



మాట్లాడుతున్న పీఏసీఎస్ అధ్యక్షుడు త్రినాథ్

విజయనగరం రూరల్: నిష్పక్షపాతంగా ప్రజలకు ఐదేళ్లపాటు సేవలందించిన గ్రామ వలంటీర్ బొబ్బాది సంతోషి మృతికి కారణమైన టీడీపీ నాయకులు ఆమె కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని దుప్పాడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. విజయనగరం మండలం దుప్పాడ గ్రామ సచివాలయం పరిధిలో వలంటీర్‌గా సేవలందిస్తున్న బొబ్బాది సంతోషి (36) శుక్రవారం గుండెపోటుతో మరణించింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ వలంటీర్లు ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శ్మశానం సమీపంలోనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీపీ నేతల రాజకీయ కక్ష సాధింపులే సంతోషి మృతికి కారణమన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున సంతోషి ప్రచారం చేసిందంటూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదుతో విజయనగరం ఎంపీడీఓ విచారణ చేయకుండానే ఏకపక్షంగా చర్యలకు ఉపక్రమించడం.. పోలీసులు విచారణ పేరిట ఆమెకు ఫోన్లు చేయడం, పుట్టుమచ్చలు అడగడంతో పేద కుటుంబానికి చెందిన సంతోషి ఆందోళనకు గురై గుండెపోటుతో మరణించిందని ఆరోపించారు. ముఖ్యంగా మహిళా వలంటీర్లపైనే టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేసి వేధింపులకు గురి చేశారన్నారు. ఇద్దరు చిన్న పిల్లలు ఉన్న వలంటీర్ మరణానికి కారణమైన టీడీపీ నాయకులు ఆమె కుటుంబానికి తక్షణమే పరిహారం చెల్లించాలన్నారు. ఆమె కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, వైస్ సర్పంచ్ బద్రి భాస్కరనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుమజ్జి రామలప్పుడు, చందక పరుశురాం, మాజీ ఉప సర్పంచ్ పైడిరాజు, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

లేఆఫ్ ప్రకటించిన జిందాల్ స్టీల్

- ముడిసరుకు కొరతే కారణమంటూ నోటీస్ జారీ
- ఆందోళనకు దిగిన కార్మికులు
- యాజమాన్య ప్రతినిధులతో చర్చించిన కార్మిక సంఘాల నాయకులు



మూతపడిన జిందాల్ కర్మాగారం

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టీల్స్ కర్మాగార యాజమాన్యం శుక్రవారం తెల్లవారు జామున లేఆఫ్‌ను ప్రకటించింది. దీనికి సంబంధించిన వివరాలతో కూడిన నోటీస్‌ను కర్మాగారం ప్రధానగేటు వద్ద అతికించింది. ప్రధాన గేటుకు తాళాలను వేయించింది. ఉదయం ఎ–షిఫ్టుకు వచ్చిన కార్మికులు నోటీస్‌ను చూసి కంగుతిన్నారు. ఈ విషయాన్ని మిగిలిన కార్మికులకు చేరవేయడంతో కార్మికులందరూ చేరుకుని గేటు వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. పరిశ్రమలో రెగ్యులర్ కార్మికులుగా 57 మంది, కాంట్రాక్ట్ కార్మికులుగా 280 మంది పని చేస్తున్నారు. గడిచిన అక్టోబర్ నెల నుంచి కర్మాగారానికి అవసరమైన ముడిసరుకు లభ్యం కాకపోవడం, ఉత్పత్తికి గిరాకీ లేకపోవడం తదితర కారణాలతో నష్టాలు వస్తున్నాయని, తప్పనిసరి పరిస్థితిలో కర్మాగారం మూసివేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించింది. ఇక్కడి కార్మికులకు జిందాల్‌కు చెందిన జోజ్‌పూర్‌లోని మరో యూనిట్‌లో పనికల్పిస్తామని పేర్కొంది. దీనికి తొలుత అభ్యంతరం తెలుపుతూ సుమారు 330 మంది కార్మికులు కర్మాగారం గేటు వద్ద ఆందోళన చేశారు. కర్మాగారం తెరిచి పనికల్పించాలని డిమాండ్ చేశారు. కర్మాగారం నష్టాల్లో ఉన్నప్పుడు తక్కువ వేతనానికే పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. సమాచారం అందుకున్న కొత్తవలస సీఐ ఎస్.చంద్రశేఖర్ కర్మాగారం వద్దకు చేరుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు.

యాజమాన్యంతో చర్చలు జరిపిన కార్మిక సంఘ నాయకులు

కర్మాగార యాజమాన్యం ప్రతినిధులైన యూనిట్ ఇన్‌చార్జి దినేష్‌శర్మ, హెచ్‌ఆర్ మేనేజర్ గోపాలకృష్ణతో కార్మిక సంఘాల నాయకుడు, వైఎస్సార్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు, టీఎన్‌టీయూసీ, సీఐటీయూ సంఘాల నాయకులు బూసాల అప్పారావు, బి.సురేష్ చర్చలు జరిపారు. ప్రస్తుత నెలకు సంబంధించి కార్మికులకు పూర్తి జీతం ఇవ్వాలని, జోజ్‌పూర్ యూనిట్‌కు వెళ్లే కార్మికులకు జీతాలు పెంచాలని, భోజనం, వసతి సౌకర్యాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఇక్కడి యూనిట్‌కు ముడిసరుకు సమకూర్చితే 20 రోజుల వేతనానికి నెలంతా కార్మికులు పనిచేస్తారని స్పష్టంచేశారు. దీనిపై యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ఈ అంశాలను యాజమాన్య ప్రతినిధులతో చర్చించి సాధ్యాసాధ్యాలను సోమవారం వెల్లడిస్తామని తెలిపారు. యాజమాన్యం తమ వైఖరి తెలిపే వరకు ఆందోళన కొనసాగుతుందని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

అప్పట్లో 11 నెలలు మూతపడిన పరిశ్రమం

2020–21లో సుమారు 11 నెలల పాటు కర్మాగారం మూతపడింది. దీంతో ప్రభుత్వం రంగప్రవేశం చేసి ప్రత్యేక రాయితీలను కల్పించి తెరిచేందుకు సహకరించింది. ప్రస్తుతం కర్మాగారాన్ని అర్థాంతరంగా మూసివేస్తే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కర్మాగారంలో పనిచేసే కార్మికుల్లో 50 శాతం మంది రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్నారు. ఈ సమయంలో వేరే రాష్ట్రంలోని యూనిట్‌లో పనికి పంపిస్తామంటే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. కార్మికుల ఆందోళనకు అప్పలన్నపాలెం, నిమ్మలపాలెం, ఉత్తరాపల్లి గ్రామాల సర్పంచ్‌లు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పప్పల బంగారనాయుడు, లగుడు వామాలు, గాడి అప్పారావు, ఎన్.చిన్నబాబు, ఎస్.భీమయ్య, బి.రమణ, బి.ఈశ్వరరావు, బి.రాము, తదితరులు పాల్గొన్నారు.



కర్మాగారం ఎదుట ఆందోళనకు దిగిన కార్మికులు



యాజమాన్య ప్రతినిధులతో చర్చిస్తున్న కార్మిక సంఘాల నాయకులు నాయుడుబాబు, తదితరులు



JSL
JINDAL STAINLESS

NOTICE

SHUTTING DOWN OF PLANT OPERATIONS :

కర్మాగార గేటు వద్ద అతికించిన లేఆఫ్ నోటీస్

క్లుప్తంగా

సెంచూరియన్‌లో ముగిసిన బూట్ క్యాంప్


శిబిరంలో మాట్లాడుతున్న వీసీ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన 72 గంటల బూట్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. ఈ క్యాంప్‌లో మొత్తం 180 మంది విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలపై ప్రాజెక్టులు తయారుచేశారు. ముగింపు కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం ప్రాజెక్టులపై విద్యార్థులు వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

శతశాతం అడ్మిషన్లు జరగాలి

- జిల్లాలో ఐటీఐ నోటిఫికేషన్ విడుదల
- ఉపాధికల్పన అధికారి వహీదా


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి వహీదా

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024లో శతశాతం అడ్మిషన్లు జరగాలని పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధి కల్పనా అధికారి వహీదా అన్నారు. ఐటీఐ జిల్లా కమిటీ మెంబర్‌ల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీఐ అడ్మిషన్స్ నోటిఫికేషన్ విడుదలైందని, దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 10 వరకు అవకాశం ఉందని తెలిపారు. ఒకేషనల్ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో అడ్మిషన్‌లు జరగాలని, ప్రతి ఒక్కరూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వృత్తి విద్యా అధికారి మంజులావీణ, కన్వీనర్‌లు, కళాశాల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- డీవీఈఓ మంజులావీణ


మాట్లాడుతున్న డీవీఈఓ మంజులావీణ

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24నుంచి జూన్ 1వరకు నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా వృత్తివిద్యాధికారిణి మంజులావీణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డీవీఈఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో పరీక్ష తప్పిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు . జిల్లాలోని 17 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 2482మంది, ఒకేషనల్ విద్యార్థులు 483మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 840, ఒకేషనల్ విద్యార్థులు 269మంది వెరసి 4074మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో 12, ట్రైబల్ వెల్ఫేర్ 2, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ 3 కేంద్రాలను పరీక్షల నిర్వహణకు ఎంపిక చేశామని, పరీక్షలు పకడ్బందీగా సీసీ కెమెరా సర్వేలెన్స్ పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

22న ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్

పార్వతీపురం: ఏపీగిరిజన గురుకుల రెసిడెన్షియల్ కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఆంగ్లమాధ్యమంలో ప్రవేశానికి ఈనెల 22న ఉదయం 10గంటలకు ఐటీడీఏ గిరిమిత్ర మీటింగ్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

సీతంపేట: మండలంలోని అడ్డాకుల గూడ దగ్గర ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ప్రమాదం సంభవించి ముగ్గురు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంపై ఏఎస్సై సంజీవ్ మాట్లాడుతూ సిరికొండకు చెందిన ప్రసాద్, సునీల్‌కుమార్‌తో పాటు మరొకరు ప్రమాదంలో గాయాల పాలవగా వారిని పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చేర్పించినట్లు చెప్పారు. సునీల్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹158	₹286	₹296

జోరుగా ఇటుకల తయారీ

- శరవేగంగా భవనాల నిర్మాణం
- మట్టి ఇటుకలకు పెరిగిన గిరాకీ
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 20వేలమందికి ఉపాధి


సంతకవిటి మండలంలోని నాగావళి నదీతీరంలో విక్రయానికి సిద్ధంగా బట్టీల వద్ద ఇటుకలు

రాజాం: వేసవికాలం కావడంతో జిల్లా వ్యాప్తంగా ఇటుకల తయారీ పెరిగింది. గతంలో కంటే ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో భవనాల నిర్మాణం, జగనన్న ఇళ్ల నిర్మాణం పెరిగింది. దీంతో మట్టి ఇటుకలకు ఉన్నపళంగా డిమాండ్ పెరిగింది. వేసవిలో ఈ ఇటుకల తయారీకి, కాల్చడానికి వాతావరణం అనువుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటుకల తయారీ పరిశ్రమలు పెరిగాయి. నిర్మాణాలకు తగ్గట్టుగా ఇటుకల తయారీని కూడా వేతనదారులు, యాజమాన్యాలు ముమ్మరం చేశాయి.

జిల్లా వ్యాప్తంగా 1400 పైగా పరిశ్రమలు

జిల్లా వ్యాప్తంగా 1400కు పైగా మట్టి ఇటుకల తయారీ పరిశ్రమలు ఉన్నాయి. ఒండ్రు మట్టి అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ ఇటుకలకు డిమాండ్ చాలా ఎక్కువ. నదీతీర ప్రాంతాల్లోని మట్టిని పలుచోట్ల పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఇటుకల తయారీ పరిశ్రమల వద్దకు తీసుకొచ్చి ఇటుకలబట్టీ తయారు చేస్తున్నారు. ఒక్కో పరిశ్రమ వద్ద 20 వేల నుంచి 50 వేల ఇటుకలు తయారవుతున్నాయి. ప్రతి పరిశ్రమ వద్ద 8 నుంచి 12 మంది వరకూ కూలీలు లబ్ధిపొందుతున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా జిల్లాలో 20 వేల మందికి ఈ పరిశ్రమలు ఈ సీజన్‌లో ఉపాధినిస్తున్నాయి.

పెట్టుబడికి తగ్గట్టు ఫలితం

ఇటుకల తయారీ పరిశ్రమకు కూలీలే పెట్టుబడిదారులు. ప్రస్తుతం అధునాతన యంత్రాలు అందుబాటులోకి రావడంతో అన్నిచోట్ల ట్రాక్టర్ ఇంజిన్ సాయంతో మట్టిని మెత్తగా చేయడం, చెక్క సైకిళ్ల సాయంతో మట్టి ఇటుకల తయారీకి మట్టిని తరలించడం చేస్తున్నారు. రోజుకు సగటున 3 నుంచి 4 వేల వరకూ ఇటుకలు తయారుచేయడం, వాటిని బట్టీలుగా చేసి, కాల్చిన అనంతరం విక్రయిస్తుంటారు. ఒక్కో బట్టీకి రూ.75 వేల వరకూ పెట్టుబడి పెడితే ఇటుకలు బాగా కాలితే రూ.50 వేలకు పైగా ఆదాయం తయారీదారులకు వస్తుంది. ఈ ఇటుకల తయారీలో కూలీలే యజమానులుగా చాలా ప్రాంతాల్లో ఉంటున్నారు. గతంలో ట్రాక్టర్ ఇటుక (2000) ధర బట్టీల వద్ద రూ.8 వేలు ఉండగా, ప్రస్తుతం వాటి ధర రూ.10 వేలకు చేరుకుంది. జగనన్న ఇళ్ల నిర్మాణం, ఇతర భవనాల నిర్మాణం ఈ వేసవిలో అధికంగా ఉండడతో ఇటుకలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. నాగావళి నదీ తీరంలోని ఇటుకలకు జిల్లాలో ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. రేగిడి మండలంలోని కుమ్మరి అగ్రహారం గ్రామం వద్ద చుట్టు పక్కల గ్రామాలు ప్రజలు అందరికీ ఇక్కడ ఇటుకల పరిశ్రమే ప్రధార ఆదాయవనరు.


రేగిడి మండలం కుమ్మరి అగ్రహారం వద్ద ఇటుకల తయారీ

వేసవిలో మంచి వ్యాపారం



ఇటుకల వ్యాపారం వేసవిలో బాగుంటుంది. నా యుక్త వయస్సు నుంచి ఇటుకల పరిశ్రమ నడుపుతున్నాను. నాగావళి నదీతీరంలో ఇటుకకు మంచి డిమాండ్ ఉంది. విశాఖపట్నం వరకూ ఇక్కడి ఇటుకలు వెళ్తుంటాయి. ఈ వేసవిలోనే ఆదాయం కూడా వస్తుంది.

పి.సత్యం, పీజేపేట, సంతకవిటి మండలం

ఉపాధి దొరుకుతుంది



ఇటుకల వ్యాపారంలో ఉపాధి దొరుకుతుంది. గతంలో కంటే ప్రస్తుతం వాటికి డిమాండ్ ఉంది. బాగా నాణ్యతతో తయారైన ఇటుకలకు అన్ని సీజన్‌లలో గిరాకీ ఉంటుంది. ఈ ఇటుకల తయారీని ఉపాధిగా మార్చుకున్నాం. బట్టీలవద్ద ఒక ఇటుక రూ.5 వరకూ పలుకుతుంది. రవాణా కొనుగోలుదారుడు భరించాలి.

తాటిపూడి రాజారావు, రంగారాయపురం, రాజాం

బస్సు ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడి మృతి


ప్రమాదంలో మృతిచెందిన డప్పు రాజు

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురం గ్రామానికి చెందిన డప్పు రాజు (30) శుక్రవారం బైక్‌పై వస్తుండగా అదే సమయంలో పార్వతీపురం నుంచి బత్తిలి వెళ్తున్న ప్రైవేట్ బస్సు వెంకటరాజపురం రహదారి వద్ద ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ప్రమాదంపై ఎస్సై డి.చిన్నంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం రాజు, మరో వ్యక్తి మండంగి వెంకటరమణ బైక్‌పై వెంకటరాజపురం పెళ్లికి వెళ్లి తిరిగివస్తుండగా పార్వతీపురం నుంచి బత్తిలి వెళ్తున్న ప్రైవేట్ బస్సు వెంకటరాజపురం రోడ్డు వద్ద ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న రాజు తలకు పెద్ద గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న వెంకటరమణకు స్వల్ప గాయం కావడంతో చినమేరంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు రాజుకు ఇంకా వివాహం కాలేదు. అన్నయ్యతో చరణ్‌తో కలిసి పెయింటింగ్ పనులు చేసేవాడు. తండ్రి నాగేష్ కలాసీ పనిచేస్తుంటాడని, తల్లి నీలమ్మ వ్యవసాయ పనులకు వెళ్లి జీవనం సాగిస్తుంటారని గ్రామస్తులు తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని యువకుడు..


బైక్ ప్రమాదంలో మృతి చెందిన సాయి

గజపతినగరం రూరల్: మండలంలోని జిన్నాం గ్రామ సమీపంలో శుక్రవారం ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ప్రమాదంలో ముచ్చర్ల గ్రామానికి చెందిన మండల సాయి(26) తీవ్రంగా గాయాలపాలై మృతి చెందాడు. ఈ ప్రమాదంపై గజపతినగరం ఎస్సై మహేష్ మాట్లాడుతూ జిన్నాం సమీపంలోని కూడలిలో ఎదురెదుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు వేగాన్ని అదుపుచేయలేక బలంగా ఢీకొనడంతో బైక్‌లపై ప్రయాణిస్తున్న వారిలో సాయి ప్రమాదంలో మృతి చెందాడన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి..


ట్రాక్టర్ బోల్తా పడి మృతిచెందిన గురుమూర్తి

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామానికి చెందిన గంటా గురుమూర్తి(44) ట్రాక్టర్ బోల్తా పడి శుక్రవారం మృతిచెందాడు. గురుమూర్తి ట్రాక్టర్‌తో జీపీ అగ్రహారం మీదుగా ప్రయాణం చేస్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడి తీవ్రగాయాల పాలయ్యాడు. కొన ఊపిరితో ఉన్న గురుమూర్తిని స్థానికుల సహాయంతో 108 ద్వారా విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు బొండపల్లి ఎస్సై ఐ.లక్ష్మణరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం..


పట్టాలపై మృతదేహం

కొత్తవలస: కొత్తవలస–విజయనగరం రైల్వేలైన్‌లో కొత్తవలస మండలంలోని నిమ్మలపాలెం బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహాన్ని ట్రాక్‌మన్ శుక్రవారం గుర్తించాడు. ఈ మేరకు విజయనగరం జీఆర్‌పీ సిబ్బందికి సమాచారం అందించడంతో ఎస్సై రవివర్మ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని, బ్లూ కలర్ జీన్‌ప్యాంట్, నీలం,తెలుపు రంగులతో కూడిన చెక్స్ షర్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని విజయనగరం రైల్వే ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఫోన్ 94906 17089 నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

విద్యుత్ వైర్లు తగిలి తమిళనాడు వాసి..


ప్రమాదస్థలంలో క్లీనర్ మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని పెద మానాపురం సంత వద్ద లారీ పైన టార్పాలిన్ సరి చేస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో తమిళనాడుకు చెందిన లారీ క్లీనర్ కార్తికేయన్(43) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై శిరీష శుక్రవారం రాత్రి మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం, కోయంబత్తూర్ జిల్లా, పొల్లిచ్చి గ్రామానికి చెందిన కార్తికేయన్ కొంతకాలంగా లారీ క్లీనర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, కుటుంబసభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

గంగపుత్రులకు మత్స్యకార భరోసా

- వేట నిషేధ భృతి రూ.10 వేలు
- 3798 మత్స్యకారుల గుర్తింపు
- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- జిల్లాలో 885 బోట్లకు వర్తింపు
- ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత అకౌంట్లలో నగదు జమ


తిప్పలవలసలో వేట చేసి ఒడ్డున నిలిపిన బోట్లు

పూసపాటిరేగ: మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఏటా సముద్రంలో వేట నిషేధ సమయంలో గంగపుత్రులకు అందించే భృతి రూ.10 వేలకు పెంచడంతో పాటు డీజిల్ సబ్సిడీ పెంచి వారి అభ్యున్నతికి కృషి చేస్తోంది. ఈ ఏడాది కూడా మత్స్యకార భరోసా సాయం లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో వేసేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వరుసగా ఐదో ఏడాది కూడా నగదు జమకానుండడంతో మత్స్యకారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సముద్రంలో వేట చేసే బోట్లకు అవసరమయ్యే ఇంధనం రాయితీపై సరఫరా చేయాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. ఆలోచన చేసిందే తడువుగా మత్యకారుల అవసరాలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేట చేసే బోట్లకు వాడే డీజిల్‌కు లీటరుకు 9 రుపాయలు రాయితీ చొప్పున నెలవారీ వారి ఖాతాలకు 1634 మంది లబ్ధిదారులకు రాయితీగా ఇచ్చిన రూ.1.81 కోట్లు నగదును అకౌంట్‌లలో ఇప్పటికే జమచేశారు. జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలో మీటర్ల మేర తీర ప్రాంతం వుంది. సముద్రంలో 584 సాంకేతిక బోట్లు, 274 సంప్రదాయ బోట్లలో మత్స్యకారులు వేటను సాగిస్తున్నారు. కొత్తగా మరో 27 బోట్లకు రిజిస్ట్రేషన్ జరిగింది. వాటితో కలిపి 885 బోట్లలో వేటకు వెళ్లే 3798 మందికి పథకం వర్తించడానికి ప్రతిపాదనలు చేశారు. గత ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రకృతి వైపరీత్యాలు సమయంలో, చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులు నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

మత్స్యకారుల కృతజ్ఞతలు

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిషేధసమయం దాటకముందే రూ.10 వేలు చొప్పున అకౌంట్‌లలోకి నగదు జమచేసింది. మత్స్యకారులకు రూ.2 లక్షలు ఉన్న ప్రమాద బీమాను 10 లక్షలు పెంచింది. 50 ఏళ్లు వున్న మత్స్యకారులకు పింఛన్ మంజూరు చేస్తున్నారు. దీంతో తమ జీవన విధానంలో సమూలమైన మార్పులు తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మత్స్యకారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గుర్తు తెలియని మహిళ హత్య ?


ఎర్రచెరువు వద్ద పడి ఉన్న మహిళ మృతదేహం

సీతంపేట: వంటినిండా కత్తిపోట్లతో గుర్తు తెలియని మహిళ (35–40 ఏళ్లు) మృతదేహం సీతంపేట మండలంలోని పులిపుట్టి గ్రామంలో కలకలం రేపింది. శుక్రవారం గ్రామస్తులకు ఈ మృతదేహం కనిపించడంతో వెంటనే గ్రామ సచివాలయ సిబ్బందికి సమాచారం అందించారు. హడ్డుబంగి వీఆర్వో అలివేలు సీతంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహితురాలైన ఆమె వళ్లంతా కత్తిపోట్లు ఉండడంతో హత్యకు గురైనట్లు భావిస్తున్నారు. ఎవరో ఎక్కడో హత్యచేసి మృతదేహాన్ని ఇక్కడికి తీసుకువచ్చి పడవేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన వాసి కాదని గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, సీతపేట, దోనుబాయి ఎస్సైలు జగదీష్‌నాయుడు, అనిల్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. స్థానిక ఎస్ఐ జగదీష్‌నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టా రు. ఆమె గురించి ఎవరికైనా తెలిస్తే ఫోన్ 6309990883, 6309990820 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

దివ్యాంగ బాలికల హాస్టల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం


మాట్లాడుతున్న జీవీబీ జగదీష్

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నగరంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నడుస్తున్న విభిన్న ప్రతిభావంతుల బాలికల హాస్టల్‌లో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఆ శాఖ జిల్లా అధికారి జీవీబీజగదీష్ శుక్రవారం తెలిపారు. 1 నుంచి 10వ తరగతి, ఇంటర్‌మీడియట్ ఆపై తరగతులు చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన బాలికలకు ఇందులో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. హాస్టల్‌లో ప్రస్తుతం 30 ఖాళీలున్నాయని, ప్రవేశం పొందిన వారికి ఉచితంగా భోజన, వసతితోపాటు కాస్మొటిక్ చార్జీలు, సంవత్సరానికి నాలుగు జతల యూనిఫాం, నోట్ పుస్తకాలు, ఇతర సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. వసతిగృహంలో ప్రవేశం పొందగోరే బాలికలు సదరం ధ్రువీకరణ పత్రం ప్రకారం 40 శాతం అంగవైకల్యం కలిగిఉండాలన్నారు. గ్రామ సచివాలయం జారీ చేసిన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు బదిలీ ధ్రువీకరణ పత్రం (టీసీ), రేషన్ కార్డు, ఆధార్, స్టడీ సర్టిఫికెట్ తదితర పత్రాలను జతజేసి దరఖాస్తులను కలెక్టరేట్‌లోని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయానికి అందజేయాలని కోరారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు నగరంలోని బాలికల వసతిగృహాన్ని నేరుగా సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9100685216 ఫోన్ నంబర్‌లో మేట్రిన్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

బొమ్మను చేసి.. ప్రాణం పోసి


- విగ్రహాల తయారీతో జీవనోపాధి పొందుతున్న చక్రవర్తి
- ఉపాధి చూపించిన ఫైన్‌ఆర్ట్స్ కోర్సు


ఇటీవల సీతంపేటలో ఆవిష్కరించిన అల్లూరి విగ్రహం ఇదే



ఫైబర్‌తో చక్రవర్తి రూపొందించిన వినాయకుడు


గోమాత విగ్రహం


మట్టితో తయారు చేసిన గౌతమబుద్ధుడి విగ్రహం


బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి తుదిమెరుగులు దిద్దుతున్న చక్రవర్తి


ఇంటిగోడకు అతికించిన రాధాకృష్ణుల ఇంటీరియల్ ఆర్ట్


బాపూజీ విగ్రహం


ఆకట్టుకుంటున్న గౌతమ బుద్ధుడి ఇంటీరియల్ డెకరేషన్ ఆర్ట్

వీరఘట్టం: గత ఏడాది సీతంపేటలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆవిష్కరించారు. అల్లూరి విగ్రహాన్ని ఇంత అందంగా ఎక్కడ తయారు చేయించారని ఆ సందర్భంగా పలువురు ఆశ్చర్యచకితులయ్యారు. అయితే ఈ విగ్రహాన్ని తయారు చేసింది వీరఘట్టం మండలంలోని తూడి గ్రామానికి చెందిన డీసరి చక్రవర్తి అని తెలియడంతో..మన ప్రాంతంలో ఇంత మంచి కళాకారుడు, శిల్పి ఉన్నాడా అని విస్తుపోయారు. చక్రవర్తి ఈ ఒక్క విగ్రహమే కాదు ఇటీవల రాజాంలో గౌతమ బుద్ధుడు, పాలకొండలో రాధాకృష్ణులు, బాలగుడబలో శివుడు, పార్వతీపురంలో బుద్ధుడు ఇలా పలు ప్రాంతాల్లో కొన్ని వందల విగ్రహాలను తయారు చేశాడు. ప్రతి కళాఖండంలో జీవకళ ఉట్టిపడేలా ఆయన చేసిన విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.

యువతకు ఆదర్శంగా చక్రవర్తి

ఆంధ్రాయూనివర్సిటీలో ఫైన్ ఆర్ట్స్ కోర్సు చేసి, ఉద్యోగం రాలేదని నిరాశ చెందకుండా తనలో ఉన్న కళకు, నైపుణ్యాన్ని జోడించి విగ్రహాల తయారీ చేస్తూ ఆకట్టుకుంటున్న వీరఘట్టం మండలం తూడి గ్రామానికి చెందిన చక్రవర్తిని పలువురు ప్రశంసిస్తున్నారు.

చాలా డిమాండ్

సాధారణంగా చాలా మంది కళాకారులు ఎక్కువగా మట్టి, సిమెంట్‌తో విగ్రహాలను తయారు చేస్తుంటారు. అయితే చక్రవర్తి మాత్రం మట్టి, సిమెంట్‌తో పాటు కంచు,ఫైబర్‌ను ఉపయోగించి విగ్రహాలు తయారు చేస్తున్నాడు.ఆధునిక టెక్నాలజీతో ఆయన ఫైబర్‌తో తయారు చేసిన కళాఖండాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ముడిసరుకులన్నీ విశాఖపట్నంలోనే అందుబాటులో ఉండడంతో ప్రతి నెలా వెళ్లి తనకు కావాల్సిన ముడిసరుకులను కొనుగోలు చేసి తెచ్చి స్వగ్రామంలోనే విగ్రహాలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.


డీసరి చక్రవర్తి

సాక్షి క్లాసిఫైడ్స్

SINGLE SITTING

■ SINGLE SITTING : 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., M.B.A, BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing, (For Drop outs /Back Logs) from recognised Universities. Exams in May/June Cont: ✆ : 73383 76874 [R-451]

WANTED

■ Wanted Team Leaders ADMS E-Bikes Showroom. Salary 20,000/- +Incentive*, Work from Home Town. Call me : 8897221102, 7095604513. [S-1236728]

■ Wanted Teachers with Fluent English and Qualified Teachers. Apply before 25-5-2024. ADMISSIONS ARE OPEN St.Mary's School Cantonment Vizianagaram. 9391806977. [S-1235768]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 95026 15217 [M-1185079]

■ శ్రీగాయత్రి కుసుమంచి సూపర్‌మార్కెట్ నందు పనిచేయుటకు డెలివరీ బాయిస్ విజయనగరం స్థానికులు కావలెను. రైతుబజారు ఎదురు, దాసన్నపేట. ఫోన్ : 79893 03314, 92478 91603 [V- 1901]

■ హైదరాబాద్‌లోని స్టార్ హోటల్స్‌లో క్యాటరింగ్ బాయ్స్ & గర్ల్స్, హెల్పర్స్, సె॥గార్డ్స్, సూ॥వైజర్స్ కావలెను. రూమ్+భోజనం ఫ్రీ. జీ:18,000/- to 30,000/- చదువులేకున్నా. ఫోన్: 9989930582 [H-801619]

■ కష్టపడేవారికి VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పు,ఆయా,నర్సులు, వంట చేయువారు,RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీరూం+ భోజనం. HYD. 9014885406 [HA-131]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ: 18K. ఫోన్: 9640258899, 9640468899 [HA-799881]

■ బొద్దాం జంక్షన్‌కి చేరువులో గల గంగుపూడివద్ద గెస్ట్‌హౌస్‌లో వాచ్‌మేన్‌గా చేయుటకు భార్యాభర్తలు (ఫ్యామిలీ) కావలెను. జీతం: నెలకు 14,000+ ఇల్లు ఇవ్వబడును. సెల్: 87901 92999. [V- 12085]

■ S.Kota, రైల్వే యార్డు వద్ద పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 20 వేలు. ఫ్రీ రూం, అర్హత: 10th, 15 Days ట్రైనింగ్. ఫోన్ చేయండి. RSR, సెల్ : 73065 82829 [V- 1629]

■ రూం ఫ్రీ, ఫీజులు లేని ఉద్యోగాలు, విజయనగరం మా ఆఫీస్ నందు OMS కేటగిరిలో వర్క్ చేయుటకు 25 సం॥లోపు, యువతి, యువకులు కావలెను. Q. 9 to డిగ్రీ, ITI (P/F) స్టైఫండ్. 10,000 to 40,000/-. ✆ : 93987 56906, [R-1602]

FACULTY TEACHERS

■ Staff with Masters and M.Ed in Physics, Chemistry, Botany, Zoology, Maths, Computers, Physical Director. Sal. 15-20K. Send Resume to Staff @omsaiemail.com, 9177558861. http://www.omsaicomdegree.org. Omsai (CBSE, Jr. College, Degree &B.Ed),maddi, Padmanabhan,VSP [WB-6621]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.